
# ఎమర్జెన్సీ వార్షిక దినం జూన్ 25 ను నిర్బంధ వ్యతిరేక దినంగా పాటిద్దాం



## పోలీసు హింసకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం !

ప్రజలారా !

21 సంవత్సరాల క్రింద జూన్ 25న అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ తన కుర్చీకి ముప్పు రాగా దేశ భద్రతకే ముప్పు వచ్చిందని వాదించి, తన చెప్పుచేతలలో ఉండే రాష్ట్రపతిని ఒప్పించి దేశంలో ఎమర్జెన్సీ విధించింది. వాక్ సభాస్వాతంత్రాలు, సంఘాలు పెట్టుకొనే హక్కు, సమావేశమయ్యే హక్కు ప్రజలు కోల్పోయారు. ఆ తరువాత రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డర్ల ద్వారా జీవించే హక్కును కాపాడుకోవడానికి కోర్టులను ఆశ్రయించే అవకాశాన్ని కూడ కోల్పోయారు. అంటే అర్థం జీవించే హక్కును కోల్పోయారని. కొన్ని వేలమందిని ఏనేరారోపణ లేకుండ ఖైదు చేసారు. వారిలో కాంగ్రెస్ అసమ్మతివాదుల నుండి ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలు, వామపక్షపార్టీల కార్యకర్తల దాకా అన్ని రకాల వాళ్లు ఉన్నారు. మేధావులు, కవులు, కళాకారులు ఉన్నారు. అంతేకాక కొన్ని వందలమందిని ఏ కోర్టు ఉత్తర్వులూ లేకుండ పోలీసులే చంపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఎమర్జెన్సీ పాలన సాగిన కాలంలో 75 మందిని 'ఎన్‌కౌంటర్ల' పేరిట పోలీసులు హతమార్చారు. ఎమర్జెన్సీ అమలులో ఉండగా కోర్టు ఉత్తర్వులు లేకుండ ఒక వ్యక్తి స్వేచ్ఛను గానీ ప్రాణాన్ని గానీ పాలకులు హరించినా సుప్రీం కోర్టు అడ్డం రాజాలదని అప్పట్లో సుప్రీంకోర్టే అభిప్రాయపడింది. ఆ తరువాత ఆ అత్యున్నత న్యాయస్థానమే నాలుక కరుచుకుంది కానీ పోయిన ప్రాణాలూ కోల్పోయిన స్వేచ్ఛ తిరిగిరావు.

**1996 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయండి**

జీవించే హక్కును 'చట్టబద్ధంగా' తొలగించడానికి ఎమర్జెన్సీ ప్రకటన కావాలి కానీ, ఏ చట్టబద్ధతా లేకుండ జీవించే హక్కును హరించడం మన పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. నిజానికి 44వ రాజ్యాంగ సవరణ తరువాత ఎమర్జెన్సీ విధించినప్పటికీ రాజ్యాంగ పరమయిన జీవించే హక్కుకు భంగం కలుగదు. పౌరుల ప్రాణాలనూ స్వేచ్ఛనూ కాపాడడానికి హైకోర్టులకూ సుప్రీంకోర్టుకూ ఉండే అధికారాలకు భంగం కలుగదు. అయితే వీటితో ఏ మాత్రం సంబంధం లేకుండ ప్రభుత్వం చేతిలో ప్రజల జీవించే హక్కుకు ప్రతీరోజూ భంగం కలుగుతూనే ఉంది. పోలీసు కస్టడీలో మరణాలూ, ఎన్‌కౌంటర్ హత్యలూ, పోలీసుకాల్పులలో చావులూ ప్రతీరోజూ దేశం నలుమూలలా జరుగుతూనే ఉన్నాయి.

మన రాష్ట్రంలో 1994 చివరి దినాలలో తెలుగుదేశం పార్టీ అధికారానికి వచ్చిన వెంటనే 'ఇకమీదట ఎన్‌కౌంటర్లు జరుగవు' అనీ 'ప్రభుత్వం పౌరహక్కులను గౌరవిస్తుంది' అనీ ఎన్టీరామారావు ప్రకటించాడు. ఆయన స్థానంలో ముఖ్యమంత్రి పదవి అలంకరించిన చంద్రబాబునాయుడు అదే ప్రకటన పునరుద్ఘాటించాడు. కానీ 1995లో 67 మంది 'ఎన్‌కౌంటర్ల'లో చనిపోయారు. 1996లో నయితే జూన్‌నెల 15వ తేదీ నాటికే 61 మంది చనిపోయారు. ఈ లెక్కన చంద్రబాబు పాలన గత కాంగ్రెస్ పాలనను తలపించేటట్టు ఉంది.

ఇవి ఎక్కడో అడవులలో లేక గుట్టలలో జరిగే ఎదురుకాల్పులని ఇప్పుడు ఎవ్వరూ నమ్మడం లేదు. నమ్మించే ప్రయత్నం సహితం పోలీసులు చేయడం లేదు. నివారించే వాళ్లు, విచారించి శిక్షించే వాళ్లు ఉంటేకదా పోలీసులు ఆ శ్రమ తీసుకోవడానికి? తాము చేసే హత్యలు ప్రభుత్వ పాలసీలో భాగం అయినప్పుడు, వాటిపైన ఏ న్యాయస్థానం కళ్లు ప్రసరించనప్పుడు, పట్టపగలే హత్యచేసి పోవడానికి వాళ్లకు ఏ బిడియం అడ్డమొస్తుంది? ఈ మధ్యనే వరంగల్ జిల్లా పీసరలోనూ కరీంనగర్ జిల్లా తిమ్మాపురంలోనూ జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలు పోలీసుల తిరస్కార వైఖరికి నిదర్శనం. తాము చంపదలచుకున్న వ్యక్తిని పట్టపగలే ఊరిలో అందరి సమక్షంలోనే పట్టుకొని, వెంటపడి వస్తున్న జనాన్ని బెదిరించి, నేలపైకీ, గాలిలోకి కాల్పులు జరిపి నిలువరించి, అందరి కళ్ల ఎదుటే బందీని కాల్చి చంపారు.

| ఈ దశాబ్దంలో రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్' మృతుల సంఖ్య | |
|---|---|
| 1991 | 104 |
| 1992 | 256 |
| 1993 | 136 |
| 1994 | 109 |
| 1995 | 67 |
| 1996 (జూన్ 15 నాటికి) | 61 |

ప్రభుత్వ నీటి పారుదల ప్రాజెక్టులను అమలుచేసే ఇంజనీరు ఎంత నిర్మొహమాటంగా పట్టపగలే గ్రనేడ్ పేల్చి బావి తవ్వకానికో కాలువ తవ్వకానికో ఉపక్రమిస్తాడో, ప్రభుత్వ హంతక విధానాన్ని అమలు చేస్తున్న పోలీసులు అంతే నిస్సిగ్గుగా పట్టపగలే తూటాలు పేల్చి ప్రాణాలు తీసి తమ సామగ్రి సర్దుకొని మరొక ఊరికి పోతున్నారు. నాలుగయిదు మోటార్ సైకిళ్లపైన యూనిఫారం లేని తెల్లబట్టల పోలీసులు వీపులకు తుపాకులు ధరించి తెలంగాణా గ్రామాలలో మృత్యుదేవతల లాగా సంచరించే దృశ్యాన్ని చూసిన వారికి మాత్రమే ఈ హంతక విధానం ఎటువంటిదో అర్థం అవుతుంది.

నక్సలైట్లు హింసామార్గాన్ని ఎంచుకున్నారు కాబట్టి పోలీసులు చట్టాన్ని పక్కన పెట్టి హత్యాకాండకు పూనుకోవడంలో తప్పులేదని వాదించే వాళ్లు మన సమాజంలో చాలా మందే ఉన్నారు. వాళ్లను మేము ఆలోచించమని కోరే విషయాలు కొన్ని ఉన్నాయి.

నక్సలైట్ ఉద్యమం హింసామార్గాన్ని ఎంచుకున్నా అదొక రాజకీయ ఉద్యమం. దానికి పేద ప్రజానీకంలో సామాజిక పునాది ఉంది. దానిని ఎదుర్కొనే కర్తవ్యం పోలీసుల చేతిలో పెట్టడం సబబేనా? అది పేద ప్రజల మీద విచ్చలవిడి హింసకు దారి తీయదా? రాజకీయ ఉద్యమాలను ఎదుర్కోవడానికి పోలీసులకు తెలిసిన పద్ధతి ఒక్కటే. ఆ ఉద్యమానికి పునాది అయిన ప్రజలను హింసించడం. అందుకే పోలీసు వ్యవస్థకు రాజకీయ ఉద్యమాలను ఎదుర్కొనే కర్తవ్యం ఎట్టి పరిస్థితిలోనూ కట్టబెట్టకూడదు. హింసాత్మక చర్యలను అదుపుచేసే కర్తవ్యం మాత్రమే దానికి ఉండాలి. అది కూడ పౌరుల ప్రాథమిక హక్కులను గౌరవించే చట్టాల పరిధిలోనే ఉండాలి. అంతే తప్ప పోలీసుల చేతిలో రాజకీయ కర్తవ్యాలు పెడితే, ప్రజలు ఏ రాజకీయాలు అనుసరించాలో వాళ్లే శాసించడం మొదలుపెడతారు. తమకు తెలిసింది నేరాల ప్రపంచమే కాబట్టి రాజకీయాలనే నేరంగా నిర్వచిస్తారు. ఇప్పటికే తెలంగాణా జిల్లాలలో పనిచేస్తున్న పోలీస్ అధికారులంతా ప్రజల రాజకీయ నిర్దేశకులయి పోయారు. రాజకీయాలకు నేరానికీ తేడా చెరిపేసారు. దీనిఫలితాన్ని విప్లవ పార్టీలేకాక అన్ని రాజకీయ పార్టీల వాళ్లు అనుభవిస్తున్నారు. స్వయంకృతాపరాధం కాబట్టి ఏమీ చేయలేక నెత్తిబాదుకుంటున్నారు.

అదేవిధంగా, నక్సలైట్ హింసనయినా వేరే హింసనయినా ఎదుర్కొనే పేరుమీద పోలీసులకు చట్టాన్నీ ప్రజల ప్రాథమిక హక్కులనూ ధిక్కరించే అధికారం ఇస్తే ఆ తరువాత రాగల ఫలితాల గురించి ఆలోచనాపరులు కొంచెం యోచించాలి. నేరం చేసాడని అనుమానించిన వ్యక్తిని కోర్టు తీర్పుకోసం ఆగకుండ పోలీసులే శిక్షించవచ్చునని నమ్మడం రాజ్యాంగ విరుద్ధమేకాదు. అప్రజాస్వామికమే కాదు. అనాలోచితం కూడ. పోలీసుల బలప్రయోగం అంత సూక్ష్మంగా ఎప్పుడూ పనిచేయదు. అది పదిమందిని హింసించి తప్ప ఒకరిని శిక్షించలేదు. అది హింసను అరికట్టే పేరు మీద సమాజాన్ని హింసామయం చేస్తుంది. చట్టబాహ్యమైన హింసకు అలవాటుపడిన పోలీసు యంత్రాంగం సమాజానికొక రాచపుండయి కూర్చుంటుంది.

ఎన్‌కౌంటర్ హత్యలేకాక ఈ దశాబ్దంలో మన రాష్ట్రంలో పోలీసు కస్టడీలో మరణాలు కూడ బాగా పెరిగాయి. **1991** నుండి **1995** దాకా సంవత్సరానికి సగటున 20 కంటే ఎక్కువే లాకప్ హత్యలు జరిగాయి. ఈ సంవత్సరమయితే జూన్ మొదటి వారంలోపలే ఆదిలాబాద్ జిల్లా మందమర్రి పోలీస్ స్టేషన్‌లో, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్లలో, చిత్తూరు జిల్లా తొట్టంబేడు, తంబళ్లపల్లి, మదనపల్లి పోలీస్ స్టేషన్లలో, గుంటూరు జిల్లా లాలాపేట, నగరంపాలెం, అమృతలూరు పోలీస్ స్టేషన్‌లలో, ప్రకాశం జిల్లా మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్‌లో, తూర్పుగోదావరి జిల్లా వై. రామవరం పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ పోలీసుల చేతిలో, మొత్తం 13 కస్టడీ మరణాలు జరిగాయి. మరి దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే పెద్ద మనిషి పాత్ర పోషిస్తున్న మన ముఖ్యమంత్రి కస్టడీ మరణాలలో ఈ దశాబ్దపు రికార్డు నెలకొల్పిన ఘనత పొందకుండ ఉండడానికి ఏమైనా చేస్తాడా? లాకప్ హత్యల గురించి తనకు సమాచారం సేకరించి ఇమ్మని ఆయన ఢిల్లీ నుండి వస్తూపోతూ ఒక ఐ.జి.ని ఆదేశించినట్టు పత్రికలలో వార్తలువచ్చాయి. ఐ.జి. దొరకు ఆ శ్రమ ఎందుకు - పౌరహక్కుల సంఘాల దగ్గర కావలసిన సమాచారమంతా ఉంది. అయినా సమాచారానికి కొదవ ఏర్పడడం వల్ల కాదు లాకప్ హత్యలు జరుగుతున్నది. వాటిని నివారించే సంకల్పం కరువవడం వల్ల జరుగుతున్నాయి. ఆ సంకల్పం తనకు ఉందో లేదో చంద్రబాబు నాయుడు ముందు నిర్ణయించుకుంటే మంచిది. కస్టడీలో బలప్రయోగానికి పాల్పడవద్దని పోలీసు యంత్రాంగానికి కచ్చితమైన ఆదేశం ఇవ్వాలి. హింసకు పాల్పడే పోలీసు సిబ్బందిని ఉద్యోగాల నుండి సస్పెండ్ చేసి కోర్టులో ముద్దాయిలుగా నిలబెట్టి విచారించాలి. మృతుల కుటుంబాలన్నిటికీ 1 లక్ష రూపాయలకు తక్కువ కాకుండ ప్రభుత్వ ఖజానా నుండి నష్టపరిహారం ఇచ్చి, బాధ్యులయిన పోలీసు సిబ్బంది నుండి దానిని వసూలు చేసుకోవాలి - ఈ మూడూ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంటే కస్టడీ మరణాలు చాలా వరకు తగ్గుతాయి.

| ఈ దశాబ్దంలో మన రాష్ట్రంలో పోలీసు కస్టడీ మరణాలు | |
| --- | --- |
| 1991 | 15 |
| 1992 | 23 |
| 1993 | 25 |
| 1994 | 24 |
| 1995 | 20 |
| 1996 ( జూన్ 4 నాటికి) | 13 |

పౌరులపైన హింసకు పాల్పడే పోలీసులను విచారించడం కోసమని చెప్పి ఈ సంవత్సరం ఫిబ్రవరినెలలో మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ జిల్లాలోనూ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు కోర్టును మానవ హక్కుల కోర్టుగా ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు పౌరహక్కుల సంఘం దాఖలు చేసిన కొద్దికేసులు తప్ప వేరే ఏ కేసులూ ఈ కోర్టుల ముందుకు రాలేదు. ఈ కోర్టులు విచారించే మానవ హక్కుల కేసులను పరిశోధించడానికి ఒక స్వతంత్రమైన యంత్రాంగమేదీ ప్రభుత్వం నెలకొల్పలేదు. మానవ హక్కుల కోర్టులు విచారించే కేసులు కూడ పోలీసులే పరిశోధించేటట్లయితే న్యాయం జరిగేదెట్లా?

పై విషయాలన్నిటి గురించీ ఆలోచించమనీ పోలీసు హింసను అరికట్టే ఉద్యమంలో భాగం కమ్మని అందరినీ ఆహ్వానిస్తున్నాం.

***<u>బహిరంగ సభ</u>***

జూన్ 25 (మంగళవారం) సా॥ 5 గం॥లకు

లయన్స్ క్లబ్ హాలు, రాంనగర్, విశాఖపట్నం.

అధ్యక్షత : పి. ఎల్. నాయుడు ( ఎ.పి.సి.ఎల్.సి. విశాఖ జిల్లా అధ్యక్షులు)

వక్తలు : ఎం.టి.ఖాన్ ( రాష్ట్ర అధ్యక్షులు, ఎ.పి.సి.ఎల్.సి.)

ఎం. కోదండరామిరెడ్డి ('స్వేచ్ఛ' సంపాదకులు)

17 జూన్ 1996

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)